

# వెండి మేఘం

సలీం

# వెండి మేఘం

'ఆంధ్రప్రభ' వార పత్రికలో

ధారావాహికంగా వెలువడిన నవల

సలీం

**శ్రీ విజయలక్ష్మి పబ్లికేషన్స్**
ఏలూరు రోడ్
విజయవాడ -2

# వెండి మేఘం

'ఆంధ్రప్రభ' వారపత్రికలో ధారావాహికంగా వెలువడిన నవల

## సలీం

*ప్రథమ ముద్రణ :* ఆగష్టు 2003

*ప్రతులు :* 1000

*వెల :* రూ. 80/-

*కవర్ డిజైన్ :*

**కాక్స్టన్ ప్రింటర్స్**

లకడికాపూల్, హైదరాబాద్

*ప్రతులకు :*

**విశాలాంధ్ర బుక్‌హౌస్** - అన్ని బ్రాంచీలు

**నవోదయ బుక్‌హౌస్,** కాచిగూడ, హైదరాబాద్

**నవయుగ బుక్‌హౌస్,** సుల్తాన్‌బజార్ హైదరాబాద్.

**సలీం,** ఫ్లాట్ నెం. 306, జె.బి. అపార్ట్‌మెంట్స్,

దోమలగూడ, హైదరాబాద్.

*ముద్రణ :* **శ్రీ విజయలక్ష్మి పబ్లికేషన్స్,** విజయవాడ.

# వెండి మేఘం

**పదకొండేళ్ల అన్వర్‌కి చప్పున మెలకువొచ్చింది. తన విశాలమైన కళ్లను అరచేతుల్తో అద్దుకుని, "బిస్మిల్లా" అనుకుంటూ మంచం దిగింది.**

అక్క పడుకున్న మంచంవైపు చూసింది. రాత్రంతా పిల్లాడి ఏడుపుతో దాదాపు మేల్కొనే వున్న సలీమున్ గాఢంగా నిద్రపోతోంది. ఆమె పక్కన పడుకున్న బాబువైపు చూసింది. వాడు తన చిన్ని నోటిని పాలు తాగుతున్నట్లు చప్పుడు చేస్తూ కదిపి, మరలా పడుకున్నాడు. అన్వర్ బైటికొచ్చి నిలబడింది.

ఆకాశం అరవిరిసిన అనార్ పువ్వులు పరిచినట్లు మనోహరంగా ఉంది. తూర్పున విచ్చుకుంటున్న ఉదయారుణ కిరణాలు - ఆ గ్రామం కప్పుకున్న లేత గులాబీరంగు చద్దర్‌లా నులివెచ్చటి అనుభూతిని కలిగిస్తున్నాయి.

పెరట్లోని జామచెట్టు కింద నిలబడి పైకి చూసింది. జామకాయలు దోరగా వున్నాయి. మరో పదీపదిహేను రోజులాగితే కానీ అవి పండేలా లేవు.

ముద్దమందారం చెట్టుకి నాలుగు పువ్వులు పూశాయి. వాటిని చూడగానే అన్వర్‌కి ముచ్చటేసింది. ఆ రంగంటే అన్వర్‌కి చాలా ఇష్టం. ఓ పూవును కోయబోయింది. మృదువుగా, తన లేత పెదవుల్తో పల్కరిస్తున్నట్లు - ఆమె

చేతిని ఆప్యాయంగా స్పర్శించిందా పువ్వు. 'ఇది చెట్టుకుంటేనే అందంగా ఉంటుంది' అనుకుని దాన్ని కోసే ఆలోచనని విరమించుకుంది.

రెండు గులకరాళ్లు ఏరుకుని, జామచెట్టు మీదకి విసిరింది. ఒక్క కాయా పడలేదు.

"అన్వర్! అన్వర్!" అమ్మ పిలుపు...

మరో పెద్దరాయి తీసుకుని చెట్టుమీదకి విసిరే ప్రయత్నంలో ఉన్న అన్వర్ దాన్ని అక్కడే పడేసి ఇంట్లోకి పరుగెత్తింది.

అన్వర్‌కి అమ్మంటే చాలా ఇష్టం. సలీమున్ ఆపా అన్నా ఇష్టమే. అందరికంటే పెద్ద సలీమున్. ఆ తర్వాత ముగ్గురు మగపిల్లలు. చివరిది అన్వర్.

అక్క మంచం దగ్గర నిలబడివున్న అమ్మని చూసి "క్యాహై మా?" అంది.

"చూడు. ఆపాకు రాత్రంతా నిద్రలేదు. బాబు మరలా లేచి ఏడుస్తున్నాడు. వాణ్ణి కొద్ది సేపు ఎత్తుకో" అంది వాళ్లమ్మ.

అన్వర్‌కి సంబరంగా అన్పించింది. బాబు పుట్టాక నలభయ్యో రోజున చేసే వేడుక "ఛిల్లా" కోసం వాళ్ల వూరు చినగంజాం నుంచి త్రోవగుంటకు వచ్చిన ఈ రెండ్రోజుల్లో ఎన్నిసార్లు అడిగిందో... వాణ్ణి ఎత్తుకుంటానని. వాడి చిన్ని చేతులు... చిన్ని కాళ్లు... బుల్లి నోరు... బుజ్జి పొట్ట... తను ఆడుకునే బొమ్మలా ఉన్నాడు వాడు.

అన్వర్ ఒక్క గెంతు గెంతి "ఆవ్ మేరే మున్నా" అంటూ వాణ్ణి ఎత్తుకో బోయింది.

"ఆగు... చంటి పిల్లాణ్ణి ఎలా ఎత్తుకోవాలో నేను చెప్తాను. ఇలా చూడు. మెడకింద జాగ్రత్తగా చేయివేసి, మరో చేతిని నడుం కిందుగా వేసి, చాలా సుతారంగా ఎత్తుకుని నీ ఒళ్లో పడుకోబెట్టు కోవాలి. మొదట నువ్వు బాసింపట్టు వేసుకుని, ఆ గోడ కానుకుని కూచో. నేను బాబును నీ ఒళ్లోకిస్తాను" అంది వాళ్లమ్మ.

అన్వర్ బుద్ధిగా వెళ్లి గోడ కానుకుని బాసింపట్టు వేసుకుని కూచుంది.

“ఆఁ... అట్టాగే కూచో... కదలొద్దు” అంటూ బాబుని ఎత్తుకుని అన్వర్ ఒడిలో పడుకోబెట్టింది.

వాడు అన్వర్ చేతుల్లోకి రాగానే ఏడుపు ఆపేసి..... ఆ అమ్మాయి మొహంలోకి చూశాడు.

“నేనురా మున్నా... నీకు పిన్నినవుతా” అందివాడితో కబుర్లలోకి దిగుతూ...

“నీవు తొందరగా పెద్దయిపోయావనుకో... మనిద్దరం కలిసి ఎంచక్కా ఆడుకుందాం. నీకు బోల్డు బోల్డు కథలు చెప్తాను. నిన్ను మా ఊరికి పిల్చుకెళ్తాను... చినగంజాం... తెలుసా.. చాలా బావుంటుంది... అంతా ఇసుక... నేన్నీకు ఇసుకతో పిచ్చికగూళ్లు కట్టటం నేర్పుతా. మా ఇంటికి దగ్గరే రైలు పట్టాలున్నాయి... రేల్‌గాడీ ఛుక్ ఛుక్.. ఛుక్ ఛుక్ అని పోతూవుంటే దూరం నుంచి చూడడం ఎంత బావుంటుందో తెలుసా... ఇంటెదురుగ్గా తురాయి పూలచెట్టుంది. వాటితో మనిద్దరం కోడిపందాలాట ఆడుకోవచ్చు” వాడితో వూసులాడుతూ తన చుట్టూ జరుగుతున్న వంట హడావుడిని మరిచిపోయింది.

బిర్యాని వండటానికి అన్ని ఏర్పాట్లు చకచకా జరిగిపోతున్నాయి. కొత్తగా కళాయి వేసిన నాలుగు దేఖ్‌షాలు తెచ్చిపెట్టారు. ఇంటికి కొద్ది దూరంగా విశాలంగా ఉన్న మైదానం లాంటి స్థలంలో గాడి పొయ్యిలు వెలిగించారు. కొంతమంది ఆడంగులు కుప్పగా పోసి వున్న బియ్యం లోంచి రాళ్లు ఏరుతున్నారు.

మరోవైపు మేకపోతుని హలాల్ చేశారు. చర్మం ఒలిచి లోపలి భాగాల్ని తీసి పడేయాల్సినవి పడేశారు. గుండెకాయ, వూపిరితిత్తులు, కాలేయం వంటి వాటిని ఓ వైపు కుప్పగా పెట్టి, మిగతా శరీరాన్ని చిన్న చిన్న ముక్కలుగా కోసి శుభ్రంగా కడిగారు. తలా, కాళ్లను సన్నటి సెగమీద పెట్టి చర్మం, వెంట్రుకలు వూడే వరకూ కత్తితో గోకి వాటిని కూడా చిన్న చిన్న ముక్కలుగా కొట్టారు.

## వెండి మేఘం

ఒక దేఖ్‌షాలో ఎసరుకి నీళ్లు పోసి మరిగాక పలావు బియ్యం అందులో వేశారు. వాటితోపాటు బాగా కడిగిన మాంసం ముక్కల్ని సగంవేసి మూతపెట్టారు. మిగిలిన సగం ముక్కల్తో కూర చేశారు. మరో దేఖ్‌షాలో 'దాల్‌చా' కాచారు.

మాంసం ఉడుకుతున్న వాసన... మసాలాల ఘుమఘుమలు . . . రకరకాల కబుర్లు.. నవ్వులు.. పరాచికాలు.. ఇల్లంతా సందడిగా ఉంది.

సలీమున్ కూడా లేచి, తలచుట్టూ గుడ్డ చుట్టుకుని, దాన్ని జారిపోకుండా మెడ కింద ముడివేసి ఆ పనిలో, ఈ పనిలో సాయపడసాగింది.

“నువ్వెందుకమ్మా శ్రమపడ్తావు? అసలే వాతావరణం చల్లగా ఉంది. బాలింతరాలివి... కొద్దిసేపు విశ్రాంతిగా నడుం వాల్చు” అంది వాళ్లమ్మ.

సలీమున్ కాపురం చూసి కన్నీళ్లు పెట్టుకోని క్షణం లేదామెకు.

దాదాపు పన్నెండేళ్ల క్రితం సలీమున్‌కి నిఖా చేశారు. అప్పుడామె వయసు పదిహేడో, పద్దెనిమిదో ఉంటుంది. పిల్ల మేలిమి బంగారంలా ఉండేది. మిసమిసలాడే పచ్చటి వళ్లు.. మెరిసే చేపల్లాంటి పెద్ద కళ్లు... అణకువ.. అభిమానం.. పెద్దలంటే గౌరవం...

అరబ్బీ, ఉర్దూ క్షుణ్ణంగా నేర్చుకుంది. రోజూ ఖురాన్ చదివేది. క్రమం తప్పకుండా రోజుకు ఐదుసార్లు నమాజ్ చదివేది.

“అబ్బాజాన్... నేను మంచి అమ్మాయిని కదూ” అని పదే పదే అడిగి, “హా బేటి.. నువ్వు చాలా బుద్ధిమంతురాలివి” అని వాళ్ల నాన్న మీరాసా చేత పొగిడించుకుని తనలో తానే మురిసిపోయేది.

“నావల్ల మీకు మంచి పేరు వచ్చేట్లు ప్రవర్తిస్తాను అబ్బాజాన్.. నా అంత మంచి కూతురున్నందుకు మీరూ, అమ్మీజాన్ గర్వపడేలా ఉంటాను” అనేది.

“నిన్నెవరు చేసుకుంటారో కానీ ఆ అబ్బాయి అదృష్టవంతుడమ్మా... అల్లాకి చాలా ప్రియమైన వ్యక్తి అయి ఉంటాడు” అనేవాడు మీరాసా.

ఆ మాట వినగానే సలీమున్ సిగ్గుపడిపోయి, "పోండి అబ్బాజాన్... ఎప్పుడూ మజాక్ చేసి నన్ను ఏడిపిస్తారు" అని లోపలికి పారిపోయేది.

కుందనపు బొమ్మలా ఉండే పిల్ల... పెళ్లయ్యాక పగిలిన గాజుబొమ్మలా తయారయింది. జీవంలేని కళ్లు... వన్నె తగ్గిన వళ్లు... నిరాశని మోస్తూ అలసిన మనసు...

ఈ పన్నెండేళ్లలో ఆరుసార్లు పిల్లలు పుట్టారు... పుట్టిన నాలుగైదు నెలలలోపే చనిపోయారు. తన కడుపున పుట్టిన పిల్లలు అల్పాయుష్షుతో పోకూడదని ఆమె అల్లాని వేడుకోని రోజు లేదు. దర్గాల చుట్టూ తిరిగింది. తావీజులు కట్టుకుంది. అయినా ఫలితం దక్కలేదు.

ఇప్పుడిది ఏడో కాన్పు... అందరూ పైకి "ఛిల్లా" అని సంతోషంగా కన్పిస్తున్నా, గుండెల్లో గుబులు దాచుకునే ఉన్నారు. ఈ పిల్లాడైనా బ్రతికి బట్టకడ్తాడా అన్న సందేహం అందరి మనసులో... వీడైనా బ్రతికితే దారీ తెన్నూ తెలీక కష్టాల కడలిలో తలమునకలౌతున్న సలీమున్‌కి ఓ ఆలంబన దొరుకుతుందన్న ఆశ...

"యా అల్లా... పర్వర్ దిగార్... నా మనవడికి నా ఆయుష్షు కూడా పోసి కాపాడు తండ్రీ" అని సలీమున్ వాళ్లమ్మ నమాజ్ తర్వాత పదే పదే 'దువా' చేసింది.

పిల్లాడు నిద్రలేచి ఏడుపు లంకించుకున్నాడు.

"మున్నా... నన్ను చూడు... నీ పిన్నిని.. ఖాలా.. చూడు... నా వైపు చూడు" అంటూ అన్వర్ ఎంతసముదాయించినా వాడు ఏడుపు ఆపటం లేదు.

సలీమున్ వాణ్ణి తన పక్కన పడుకో బెట్టుకుని పాలు పట్టింది.

అదే మంచం మీద ఓ చివరగా కూచుని ఉన్న వాళ్లమ్మకు ఎముకల పోగులా ఉన్న తన కూతుర్ని చూస్తే దుఃఖం ఆగింది కాదు. "బేటీ... ఎలా అయిపోయావో చూశావా... ఎలా ఉండేదానివి? ఏమైనా కష్టంగా ఉందా... సంసారం సజావుగానే

ఉంది కదా... ఏమైనా ఉంటే నాకు చెప్పు తల్లీ" అంది.

సలీమున్ బలహీనంగా నవ్వి, "నాకేమైంది అమ్మీజాన్... నేను సుఖంగానే వున్నాను" అంది.

బాసింపట్టు వేసుకుని అక్కడే కూచునివున్న అన్వర్‌తో "ఇంకా అలానే కూచున్నావేం? వెళ్లి కాస్సేపు ఆడుకో పో" అంది వాళ్లమ్మ.

"మున్నా పాలు తాగాక మళ్లా నా ఒళ్లో పడుకోబెట్టవా అమ్మీజాన్" ఆశగా మెరిసే కళ్లతో అడిగింది అన్వర్.

"చాల్లే... కాళ్లు నొప్పులు పుడ్తాయి. వీడు పడుకుంటాడ్లే. నువ్వెళ్లి పిల్లల్తో కొద్ది సేపు ఆడుకో" తన చెల్లెలి వైపు ఆప్యాయంగా చూస్తూ అంది సలీమున్.

ఆమెకు చెల్లెలంటే వల్లమాలిన ప్రేమ. అందరికంటే చిన్నది కావటం... ముగ్గురు మగపిల్లల తర్వాత పుట్టిన ఆడపిల్ల కావటం... వాళ్లిద్దరి వయసులో అధిక వ్యత్యాసం ఉండటం... ఇవన్ని కారణాల వల్ల అన్వర్‌ని చూస్తే చెల్లెల్లా కాకుండా కూతుర్లా అనిపిస్తుందామెకు.

సలీమున్ పెళ్లయిన ఐదోనెలకే గర్భవతి అయింది. వాళ్లమ్మ కూడా అప్పుడు కడుపుతో ఉంది. ఇద్దరికీ కాన్పు కొన్ని రోజుల తేడాతో జరిగింది. మొదట సలీమున్ ఆడపిల్లను కంది. ఆమెకు కాన్పు అయిన ఇరవై రోజులకు వాళ్లమ్మ అన్వర్‌ని కంది. ఎటొచ్చీ ఆరోనెల నిండకుండానే సలీమున్‌కి పుట్టిన బిడ్డ చనిపోయింది.

మీరాసా వెళ్లి కూతుర్ని పుట్టింటికి పిల్చుకొచ్చాడు... బాలింతరాలు... బిడ్డపోయిన దుఃఖంతో ఉన్న సలీమున్‌కు ఆరునెలల వయసున్న అన్వర్ తన కూతురిలానే అన్పించేది. ఆ పిల్లని ఎత్తుకున్నా.. ముద్దాడినా.. వూసులాడినా.. మాతృభావం పెల్లుబికేది.

వాళ్లమ్మకు పాలు సరిగా పడలేదు. సలీమున్‌కి పాలు నిండిపోయి ఛాతి

సలపరంగా ఉండేది. అందుకే పుట్టింట్లో ఉన్నన్ని రోజులు అన్వర్‌కి తన పాలు పట్టింది. వాళ్లమ్మ కూడా అన్వర్‌ని పూర్తిగా సలీమున్‌కి అప్పగించి మిగతా పనులు చూసుకునేది. అందుకే ఇప్పటికీ అన్వర్‌ని చూస్తే సలీమున్‌కి తన పెద్ద కూతురనే అన్పిస్తుంది.

“అన్వర్.. ఇటు రామ్మా” అని పిల్చింది సలీమున్.

వాళ్ల చిన్నన్నతో ఆరిందాలా కబుర్లు చెప్తూ... తన కళ్లని చక్రాల్లా తిప్పుతూ వంట పూర్తయిందో లేదోనని గమనిస్తున్న అన్వర్, అక్క పిలుపు విని ‘క్యాహై ఆపా’ అంటూ వచ్చింది.

సలీమున్ తన కొంగు చివర కట్టివున్న ముడి విప్పి అందులోంచి రాగికాణీ తీసి చెల్లెలికిచ్చింది.

“సాయంత్రం శెట్టికొట్టు కెళ్లి పప్పులూ, బెల్లం కొనుక్కో” అంది.

“షుక్రియా ఆపాజాన్” అంటూ తూనీగలా ఆ పిల్ల తన చిన్నన్న దగ్గరకు పరుగెత్తి వాడికి రాగికాణీ చూపించి “చూశావా... సలీమున్ ఆపాకు నేనంటే ఎంతిష్టమో! నన్ను దగ్గరకు తీసుకుని మేరీజాన్ అంది తెలుసా” అంది.

తన చెల్లెల్నే గమనిస్తున్న సలీమున్ మనసారా నవ్వుకుంది.

సమయం పన్నెండు కావస్తోంది. వంటలన్నీ పూర్తయ్యాయి. గోంగూర పచ్చడి... ఆలూ కుర్మా... దాల్ చార్... మాంసం ఇగురూ.. బిర్యానీ...

వసారాలో చాపలు పరిచి విస్తళ్లు వేశారు. సలీమున్ తమ్ముళ్లు వడ్డించడానికి పూనుకున్నారు. మీరాసాహెబ్ అజమాయిషీ చేస్తున్నాడు.

అల్లుడు బాషాని పిలిచి, “మియా... ఏర్పాట్లు మీకు సంతృప్తిగానే ఉన్నాయి కదా... ఏదో నాకు చేతనైనంతలో చేయిస్తున్నాను. ఏమైనా లోటు పాట్లుంటే సర్దుకుపోండి” అన్నాడు.

బాషా గుంభనగా నవ్వి ఊరుకున్నాడు. సమాధానం చెప్తే రేపేమైనా దెప్పి

పొడవడానికి అవకాశం ఉండదని జాగ్రత్తపడ్డాడు.

ఆడవాళ్లకి ఇంట్లోనే జంపఖానాలు పరచి విస్తళ్లు వేశారు.

"నేను వడ్డిస్తానమ్మా" అంది అన్వర్.

"వద్దు... నువ్వు బంతిలో కూచుని తినేయ్... చివరివరకూ ఉంటే బిర్యానీలో ముక్కలు మిగలవు" అంది వాళ్లమ్మ.

"నాకు ముక్కలు లేకున్నా పర్లేదు. నేను వడ్డిస్తాను" మారాం చేసింది.

"సరే... గోంగూర పచ్చడి వడ్డించు.. జాగ్రత్త... విస్తట్లో కొద్దికొద్దిగానే వేయి... వంగి వడ్డించాలి... పైనుంచి విదల్చకూడదు... చాలా తప్పుగా అనుకుంటారు"

"నాకు తెలుసులేమ్మా" అంటూ ఛెంగున లేడిపిల్లలా పరుగెత్తింది.

అమ్మ చెప్పిన జాగ్రత్తల్ని మననం చేసుకుంటూ వడ్డిస్తున్న అన్వర్ ధడేలున పడిపోయింది. గిన్నెలోని పచ్చడంతా నేలపాలైంది. మాంసం కూర వడ్డిస్తున్న పెద్ద వదిన అన్వర్‌ని వెనక చూసుకోకుండా వంగడం వల్ల... అదే సమయంలో అటువైపు వారికి వడ్డించడానికి ఒంగిన అన్వర్‌కి తగిలి.. అన్వర్ బోర్లా పడింది.

ఆమె వెనక్కి తిరిగి అన్వర్‌నూ - ఆ పిల్ల మొహానికీ, చేతులకూ అంటిన గోంగూర పచ్చడిని చూసి ఫక్కున నవ్వి, "కళ్లు కన్పించడం లేదా" అని తన తప్పుని కప్పి పుచ్చుకుంటూ, అన్వర్‌దే తప్పన్నట్లు మాట్లాడింది.

అవమానం, రోషం, కోపం... అన్నీ ఒక్కసారిగా ఉప్పెనలా ముంచుకొచ్చి అన్వర్ గొల్లుమంది.

చెల్లెలి ఏడుపు విన్పించి సలీమున్ పరుగెత్తుకొచ్చింది.

"అమ్మీజాన్ వద్దంటే విన్నావా? చూడు ఎలా చేసుకున్నావో" అంటూ మొహానికీ, చేతులకీ అంటిన పచ్చడిని గుడ్డతో తుడిచి, "పోయి నీళ్లతో కడుక్కోపో" అంది.

ఆ గొడవకి బైటినుండి బాషా కూడా వచ్చాడు. ఏడుస్తున్న మరదల్ని జామచెట్టు కిందికి పిల్చుకెళ్లి నీళ్లతో కడిగాడు.

ఇంకా ఏడుస్తూనే వున్న మరదల్ని ఎత్తుకుని "ఏడ్వకూడదు... మంచి అమ్మాయివి కదా" అన్నాడు.

"చాల్లెండి బుజ్జగించడం... దింపండి దాన్ని... అదింకా చిన్న పిల్లను కున్నారా.... దానికి పదకొండేళ్లు వచ్చాయి" చిరుకోపంగా అంది సలీమున్.

బక్కపల్చగా.. చాలా తేలిగ్గా ఉన్న అన్వర్‌ని దింపకుండానే అన్నాడు బాషా, "చిన్నప్పుడు దీన్ని ఎన్నిసార్లు ఎత్తుకుని భుజం మీద మోయలేదూ...ఇప్పటికీ ఇది చిన్నపిల్లే"

అన్వర్‌కి బావ ఎత్తుకోవడంతో కొంత వూరట అన్పించింది. బుగ్గల మీంచి జారిన కన్నీళ్లు తుడుచుకుంటూ, "మున్నా ఏం చేస్తున్నాడో?" అనుకుంటూ బాబు దగ్గరకు పరుగెత్తింది.

******

రాత్రికి భోజనాలయ్యాక మగవాళ్లందరూ వసారాలో పడకలు వేసుకున్నారు.

నిద్ర పట్టక అందరూ మీరాసాహెబ్ చుట్టూ చేరారు. మీరాసా సాల్ట్ ఇన్‌స్పెక్టర్ దగ్గర ప్యూన్‌గా పనిచేస్తున్నాడు. అతను పనిచేసేది తెల్లదొరల దగ్గర కావడం వల్ల దేశ రాజకీయాలకు సంబంధించిన విషయాలు తెలుస్తాయని అతన్ని కదిపారు.

"దేశ విభజన తప్పదంటారా చాచాజాన్" వచ్చిన చుట్టాల్లో ఒక యువకుడు మీరాసాని అడిగాడు.

"ముస్లిం లీగ్ నాయకులు పట్టుబడ్తున్నారు కాబట్టి దేశ విభజన తప్పదు. గాంధీగారు కూడా విభజనకు తన అంగీకారాన్ని తెలియచేశారు. ఎలాగూ పార్లమెంటుకీ, విధానసభలకీ ఎలక్షన్లు అయిపోయాయిగా. అతి త్వరలో మనకు

పూర్ణ స్వరాజ్యం లభించనుంది" అన్నాడు మీరాసా.

"మనదేశం హిందూ రాజ్యంగా, ముస్లిం రాజ్యంగా విడిపోతే మన పరిస్థితి ఏమిటి?"

"ముస్లింలందరికీ వేరే రాజ్యం కావాలన్న ముస్లింలీగ్ కోరిక వెనక ఉన్న బలమైన కారణం మతపరమైంది కాదు. అది రాజకీయపరమైంది. మనం ఈ దేశంలో పుట్టాం...ఇక్కడే పెరిగాం... ఇక్కడే ఉండిపోతాం... ఈ మట్టిలోనే మన శరీరాలు కల్సిపోవాలి. కొంతమంది ముస్లింలు విడిపోయి వేరే రాజ్యంగా ఏర్పడితే అది ముస్లిం రాజ్యమౌతుందేమో కానీ మనది హిందూ రాజ్యం మాత్రం కాదు. మనది భారతదేశం... ఈ దేశంలో పుట్టి... ఈ దేశాన్ని ప్రేమించి... ఈ దేశంలో నివసించే ప్రతి హిందూ, ప్రతి ముస్లిం, ప్రతి కిరస్తానీ భారతీయుడే. నేను మాత్రం మన ముస్లింసోదరులు మాతృదేశాన్నుంచి విడిపోవడాన్ని సమర్థించను".

"అది సరే... ముస్లిం దేశం ఏర్పడ్డాక చాలామంది ముస్లింలు అక్కడ స్థిరపడితే మనం మైనారిటీ అవుతాంకదా... అప్పుడు మనకు రక్షణ ఉంటుందంటావా" మీరాసా రెండోకొడుకు బద్రుద్దీన్ అడిగాడు.

"భారతదేశ స్వాతంత్రోద్యమంలో అల్పసంఖ్యాకవర్గమైన ముస్లిం సమాజం తనదైన భాగస్వామ్యాన్ని అందించిన విషయం మన దేశప్రజలు మరవరు. బ్రిటీష్ పాలకులతో వీరోచితంగా పోరాడి అమరుడైన టిప్పుసుల్తాన్, ఝాన్సీలక్ష్మీబాయితో కలిసి తెల్లదొరలను ఎదుర్కొన్న బేగం హజరత్ మహల్, మౌల్వీ అహ్మదుల్లా, మౌలానా ఆజాద్... మన దేశాన్ని దాస్యవిముక్తురాలిగా చేయడంలో ఎందరో ముస్లింసోదరులు రక్తం ధారపోశారు. తమ ప్రాణాల్ని అర్పించారు. స్వాతంత్ర్య ఫలాన్ని అనుభవించే అధికారం హిందువుల్తోపాటు మనకూ ఉందన్న నిజాన్ని హిందూ సోదరులు విస్మరించరు. మనం ఈ దేశంలో ఉండిపోవటంలోనే మన క్షేమం దాగి వుందనేది నా నమ్మకం".

"కానీ చాచా... ముస్లిం దేశంలో మన ముస్లింసోదరులకు దొరికేటన్ని అవకాశాలూ... అధికారాలూ ఇక్కడ ఉండిపోవడానికి నిశ్చయించుకున్న మనలాంటివాళ్లకు దొరుకుతాయా అనే అనుమానం.. అలా అనేకంటే భయం అనొచ్చు...మనందరి మనసుల్లో ఉంది కదా".

"అటువంటి భయాలకు అవకాశం లేదు బేటా. అందరికీ సమాన అధికారాలు, సమాన అవకాశాలు కల్పించబడ్డాయి. గాంధీజీ, నెహ్రూలాంటి నాయకులున్నంత కాలం మనకు అన్యాయం జరుగుతుందన్న భయం అర్థం లేనిది".

అలా కబుర్లు చెప్పుకుంటూనే ఏ అర్థరాత్రికో నిద్రపోయారు.

సలీమున్‌కి సరిగ్గా నిద్రపట్టటం లేదు. ఆరుసార్లు తన కడుపు పండింది. నలుగురు మగ పిల్లలు. . . ఇద్దరు ఆడపిల్లలు. . . అందరికీ అల్లా పేర్లే పెట్టింది. కానీ ఏ ఒక్కరూ మిగల్లేదు.

అత్త మంచిది కాబట్టి సరిపోయింది. కానీ ఈ మధ్య బాషా పోరు ఎక్కువైంది. వంశాంకురం కోసం మరో నిఖా చేసుకుంటానని తరచూ బెదిరిస్తున్నాడు. అత్తయ్యే మాత్రం "నోర్మూసుకోరా... అందులో అమ్మాయి తప్పేముంది? వాళ్లకు ఆయుష్షు లేక ఏదో ఓ జబ్బు చేసి చచ్చిపోతున్నారు. ఈ పల్లెటూళ్లో సరైన హకీంలు ఎవరున్నారని? ఏ రోగమో, రొష్ఠో వస్తే ఆచారి గారి దగ్గరకెళ్లి ఏవో మాత్రలు మింగటం తప్ప . . . ఇదంతా మన బద్ నసీబ్. . . దురదృష్టం అనుకోవాలి తప్ప, కోడల్ని ఏమైనా అన్నావో నేనొప్పుకోను" అంది.

ఇపుడు పుట్టిన బిడ్డకీ పుట్టగానే కుడిచెవిలో 'ఆజా' చెప్పారు. ఎడమచెవిలో ఇఖామత్ చెప్పారు. ఏడోరోజు "రఫీ" అని పేరు పెట్టారు.

"యా అల్లా. . . ఈ ఒక్క నలుసునైనా ఆయుష్షు పోసి నిండునూరేళ్లు బతికించు తండ్రీ" అని కోరుకుంది.

తన జీవితంలో బ్రతుకు మీద తీపి పెరగడానికి. . . జీవించాలన్న కోరిక

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=186**